క్లుప్తంగా

హైలెవల్ వంతెనకు డ్రిల్స్



శాయంపేట : మండలంలోని జోగంపల్లి–కొప్పుల గ్రామాల మధ్య రూ.7 కోట్లతో నిర్మించిన హైలెవల్ వంతెనపై నీరు నిలువకుండా అధికారులు ఆదివారం డ్రిల్స్ వేయించారు. నీరు ఆగుతోందని, డ్రిల్స్ వేయాలని అధికారులను ప్రజలు పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోలేదన్న అపవాదు ఉంది. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి వంతెనను ప్రారంభించడానికి ఆదివారం రానుండడంతో అధికారులు ఎట్టకేలకు పనికి ఉపక్రమించారు. ఆగమేఘాల మీద డ్రిప్ వేయించి నీరు పోయేలా ఏర్పాట్లు చేశారు.

సర్పంచ్‌కు పరామర్శ



నడికూడ : స్థానిక సర్పంచ్ ఊర రవీందర్ రావును బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు, మాదారం సొసైటీ డైరెక్టర్ ఊర సతీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన వ్యక్తులు దాడి చేయగా గాయపడిన సర్పంచ్ రవీందర్‌రావు చికిత్స అనంతరం ఇంటికి చేరుకోగా పలువురు ఆయన్ను కలిసి పరామర్శించారు. ఘటనపై అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌ను పరామర్శించిన వారిలో నాయకులు సదానందం, ముస్కె రాము, పోచంపల్లి రఘుపతి, బొల్లారం అనిల్ కుమార్, గుడికందుల శివ, వెంకటేశ్, ప్రశాంత్, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ఐనవోలు : కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి గాయాలపాలైన ఘటన మండలంలోని సింగారం జోగయ్యపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలానికి చెందిన ఓ వ్యక్తి కారులో గుంటూరుపల్లి చర్చికి వచ్చి తిరుగు ప్రయాణం అయ్యాడు. అతడి కారు వ్యవసాయ క్షేత్రానికి బైక్‌పై వెళ్తున్న జోగయ్యపల్లికి చెందిన ఆకారపు మహేందర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేందర్‌కు గాయాలు కాగా స్థానికులు ఆయన్ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

'నిధుల కేటాయింపునకు ప్రధాని హామీ'

శాయంపేట : గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని మండలంలోని తహరాపూర్ సర్పంచ్ మౌనిక రవికిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆదివారం ఆమె మాట్లాడారు. వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప సభకు విచ్చేసిన సందర్భంగా ప్రధాని మోదీని వరంగల్‌లోని శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయంలో తాను కలిసి స్వాగతం పలికినట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని తాను కోరగా ప్రధాని సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధానిని కలిసే అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర నాయకులు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్‌కు, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి సత్యపాల్‌రెడ్డికి సర్పంచ్ మౌనిక కృతజ్ఞతలు తెలిపారు.

'బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి'

దామెర : బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని మండలంలోని కొగిల్వాయి గ్రామానికి చెందిన ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, దామెర సర్పంచ్, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటన సందర్భంగా తాము ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ప్రధానిని కలిసిన క్రమంలో రెట్టింపు ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పని చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు విశ్రమించేది లేదని వారు తేటతెల్లం చేశారు.

గుండెపోటుతో బల్దియా సీనియర్ కాంట్రాక్టర్ మృతి

వరంగల్ అర్బన్ : బల్దియా సీనియర్ కాంట్రాక్టర్, వరంగల్ కరీమాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ మాటేటి రవీందర్(55) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన పలు డివిజన్లలో సుమారు రూ.5–6 కోట్ల వరకు పనులు పూర్తి చేయగా సకాలంలో బిల్లులు రాక, ఇతర పనులు చేయలేక మనోవేదన, ఒత్తిళ్లు, ఆర్థిక లోటుతో గుండెపోటుకు గురైనట్లు జీడబ్ల్యూఎంసీ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయం అధ్వానం

స్టోర్ రూమ్‌ను తలపిస్తున్న సమావేశ మందిరం

- నీటి లీకేజీతో పరిసరాలు బురదమయం
- అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం



సమావేశ మందిరంలో సామగ్రి

శాయంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమస్యలకు నిలయంగా మారి అధ్వానంగా తయారైంది. మండల పరిషత్ కార్యాలయానికి మండలంలోని 24 గ్రామాల నుంచి ప్రజలు తరచూ వచ్చి వెళ్లడం పరిపాటి. ఈ క్రమంలో కార్యాలయంలో సిబ్బంది, ప్రజల అవసరాల కోసం గతంలో టాయిలెట్లు నిర్మించగా సిబ్బంది అందులో చెత్తాచెదారం వేసి డంపింగ్ యార్డ్‌గా మార్చారు. గ్రామాల నుంచి పలు పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, ప్రధానంగా మహిళలు పబ్లిక్ టాయిలెట్లకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించే సమావేశ మందిరాన్ని ప్రస్తుతం స్టోర్ రూమ్‌గా మార్చారు. ఇదిలా ఉండగా కిటికీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ క్రమంలో వర్షం కురిస్తే నీరు చేరడం ఖాయం.

చైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీడీఓ గదులు ఓకే..

మండల పరిషత్ కార్యాలయంలోని జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీడీఓ రూంలను ఏసీ, ఇతరత్రా సదుపాయాలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రజలకు ఉపయోగపడే టాయిలెట్లను గాలికి వదిలేశారన్న అపవాదు ఉంది.

నీటి లీకేజీలతో బురదమయం

ఎంపీడీఓ కార్యాలయం వెనుకాల నీటి పైపులైన్ లీకేజీలు ఏర్పడుతుండడంతో పరిసరాల్లో నీరు నిలిచి బురదమయం అవుతున్న దుస్థితి నెలకొంది. తద్వారా దోమలకు ఆవాసంగా మారింది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని మండల పరిషత్ కార్యాలయంలో అవసరమైన మరమ్మతులు చేపట్టి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



టాయిలెట్‌లో చెత్తాచెదారం



నీటి లీకేజీతో బురదమయమైన కార్యాలయ వెనుక భాగం

దళితుల అభ్యున్నతికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యమిస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మండలంలోని కొప్పుల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని ఆయన చెప్పారు. మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు వద్ద రూ.10.21 కోట్ల వ్యయంతో చేపట్టిన సమగ్ర మరమ్మతు పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి ఆయన ఆదివారం శంకుస్థాపన చేసి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేశారు. అనంతరం జోగంపల్లి–కొప్పుల గ్రామాల మధ్య రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. తదనంతరం కొప్పులలో పద్మశాలీ, రజక కమ్యూనిటీ హాళ్లకు, వెటర్నరీ ఉపకేంద్రానికి, కొప్పుల సూర్యనాయక్ తండా బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పులలో సర్పంచ్ గోలి మాధురి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చి దళితులకు సమాజంలో సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సహకరించకపోయినా సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం ముందుంటోందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, బీమా చెక్కులు పంపిణీ చేశారు. గట్లకానిపర్తిలో నిర్వహించిన శ్రీ మహంకాళి మాత బోనాల జాతరలో గండ్ర దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



చలివాగు ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర దంపతులు

జాతి నిర్మాణంలో యువత కీలకం

- మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్



అశోక్



రాజేశ్

ఐనవోలు : జాతి నిర్మాణంలో ముదిరాజ్ యువత కీలకమని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ తెలిపారు. ముదిరాజ్ కులస్తులు రాజ్యాధికారం సాధించే దిశగా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశానికి దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా విద్య, ఉద్యోగ సాధికారత కోసం అసోసియేషన్ పని చేస్తోందని తెలిపారు. ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ, సామాజిక, ఇతర అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఆ దిశగా అసోసియేషన్ పాటు పడుతోందని చెప్పారు. సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ మల్లిక్ ఎంవీకే మాట్లాడుతూ ఆటపాటలతోనే సంఘంలో ఐక్యత, అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం మెపా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాటబోయిన అశోక్, ప్రధాన కార్యదర్శిగా చెన్నూరు రాజేశ్, ఉపాధ్యక్షులుగా చెన్నూరి సాంబరాజు, కాటబోయిన శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా అంబటి శివ, కాటబోయిన శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా వినయ్, శ్రీనివాస్, నారాయణ, సత్యనారాయణ, రాజు, రాజేందర్, ఉపేందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూమ భిక్షపతి, రాష్ట్ర కమిటీ సభ్యుడు నీరటి రాజు, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు సుంచు ప్రశాంత్, శ్యాంసుందర్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెవ్వ సతీశ్, నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులి దేవేందర్

మహంకాళీ బోనాలు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం శ్రీ మహంకాళీ అమ్మవారి బోనాల జాతర వేడుకగా నిర్వహించారు. మహిళలు బోనాలతో భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య మాట్లాడారు. శ్రీ మహంకాళీ అమ్మవారి దీవెనలతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. పాడిపంటలు బాగా పండి ప్రజలు, రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బత్తిని రజని సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మకంటి పోశాలు, వైస్ చైర్మన్ బొమ్మకంటి శ్రీకాంత్, ఆలయ పూజారి గూడ వాసుదేవమూర్తి, రాఘవేంద్ర శర్మ, బొమ్మకంటి రాజేందర్, సంపత్, ఆనందం నరేశ్, రాజేందర్, భరత్, రాంబాబు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి

సాక్షి ఎఫెక్ట్..

ధర్మసాగర్ : విద్యుత్ స్తంభం విరిగి రైతులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' ఆదివారం ప్రచురించిన కథనానికి అనూహ్య స్పందన లభించింది. విద్యుత్ శాఖ అధికారులు రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. వివరాలిలా.. ధర్మసాగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సోమదేవరపల్లి శివారులోని విద్యుత్ స్తంభం విరిగి రైతులు కొద్ది రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రైతులు వాపోయారు. ఈ క్రమంలో 'సాక్షి' సమస్య పత్రికా కథనం రూపంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆదివారం ఉదయమే ఆ శాఖ అధికారులు స్పందించారు. డివిజనల్ ఇంజనీర్ సామ్యా నాయక్, ఏడీఈ దానయ్య, ఏఈ సుధాకర్ విరిగిన స్తంభం వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ స్తంభం విరిగి ఎన్ని రోజులైంది? ఎదురైన ఇబ్బందులు, తదితర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి విరిగిన స్తంభం స్థానంలో అప్పటికప్పుడు నూతన స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించారు. అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి సమస్యను పరిష్కరించడంతో రైతులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు, 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



స్తంభం ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కమలాపూర్ : మండలంలోని అంబాల గ్రామంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలలో ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు చిన్ననాట విద్యాబుద్ధులు నేర్పిన గురువులైన లకుం రాజశేఖర్, పిల్లల జయప్రకాశ్, గొర్రె సాయిరెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తదనంతరం పాఠశాలకు సౌండ్ సిస్టంను బహూకరించారు. తమ మిత్ర బృందంలో ఆర్థికంగా వెనుకబడిన పూర్వ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పుల్ల సంపత్, పూర్వ విద్యార్థులు గడ్డం మురళీబాబు, వలుస సదానందం, సంపత్, గడ్డం వెంకటేశ్వర్లు, విరాటి దేవేందర్, కొత్త కరుణాకర్ రెడ్డి, చిరుత సమ్మయ్య, బోయిని శ్రీనివాస్, అచ్చె జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఐద్వా జిల్లా సదస్సును జయప్రదం చేయండి

వరంగల్: మహిళా హక్కులు– ప్రభుత్వ విధానాలు అనే అంశంపై సోమవారం ఉదయం 11 గంటలకు అబ్బూస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే జిల్లా సదస్సుకు పెద్ద ఎత్తున మహిళా లోకం పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సదస్సుకు ఐద్వా మాజీ జాతీయ అధ్యక్షులు సుభాషిణి అలీ హాజరై సామాజిక ఆర్థిక సమస్యలపై ప్రసంగిస్తారని తెలిపారు. విజయ, రేణుక, సంగీత, కల్పన పాల్గొన్నారు.

రైల్వేపవర్ లిఫ్టర్లకు స్వాగతం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో ఆది వారం రాత్రి రైల్వే పవర్ లిఫ్టర్లకు స్వాగతం పలికారు. ఈ నెల 4 నుంచి 7 వరకు ఉత్తరా ఖండ్ రాష్ట్రం కాశిపూర్‌లో జరిగిన ఆల్ ఇండి యా రైల్వేస్ పవర్ లిఫ్టింగ్– 2023 చాంపియన్‌షిప్‌లో కాజీపేట సబ్ డివిజన్‌కు చెందిన రైల్వేట్రాక్ ఉమెన్ సిహెచ్.మమతతో పాటు రమ్యకృష్ణ, ఆశీక, విజయవాడ, గుంటూరు డివి జన్‌కు చెందిన పవర్ లిఫ్టర్లు పాల్గొని న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. పవర్ లిఫ్టర్లకు కాజీపేట నేషనల్ పవర్ లిఫ్టర్, కోచ్ ఎండి.జాఫర్ స్వాగతం పలికారు.

'భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు'

ధర్మసాగర్ : భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువని ఇందూ జ్ఞానవేదిక ఎల్కతుర్తి మండల కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి తెలిపారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమంలో నిరంజన్ సిద్ధాంతి మాట్లాడారు. గురువు గుణాతీతుడని చెప్పారు. రూపవర్జితుడని అభివర్ణించారు. 'గుంద్రము' అనే పదం నుంచే 'గురువు' పుట్టిందని తెలిపారు. ఆదిమధ్యాంత రహితుడైన పరమాత్మ భూమిపై భగవంతుడు శ్రీకృష్ణుడిగా జన్మిస్తే అయన్ను గురువు అని అంటారని విశదీకరించారు. పూర్వము గురువును గుండ్రాయి లాంటి వాడని సామెత ఉండేదన్నారు. ఆది, అంతము లేని గుండ్రాయికి కూడా మొదలు, చివర అనేవి ఉండని నేపథ్యంలో గురువును అలా పోల్చారని చెప్పారు. దేవుడే మనిషిగా జన్మిస్తే అయన్ను మాత్రమే గురువని పిలవాలని సూచించారు. ఆషాడ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండే క్రమంలో గురుపౌర్ణమిగా నిర్ణయించి శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి పూజ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు వెంకట్, రాణి, రేవతి, రాధ, ఆదిత్య, కళ్యాణి, క్షేత్రజ్ఞ, ఆదిత్య, దీపు, శివ నారాయణ సింగ్, కల్పన తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నిరంజన్ సిద్ధాంతి

క్రీడల్లో పిల్లలు ఆసక్తి పెంచుకోవాలి

వరంగల్: ప్రస్తుత సమాజంలోని పిల్లలు సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఇన్నర్‌వీల్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు తాబేటి వెంకట్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదరంగం ఆడడం వల్ల జ్ఞాపకశక్తితో పాటు చురుకుదనం పెరుగుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి 250 మంది పిల్లలు పాల్గొన్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. కార్యక్రమంలో రజనీకాంత్, శివ కృష్ణ, శ్రీనివాస్, రాంప్రసాద్, అనిల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

ఇబ్బందులను పరిష్కరించాలి

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ శివారులో ఉన్న గ్రానైట్ క్వారీలతో కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు బృందావన్ కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. కాలనీ అధ్యక్షురాలు బర్ల సరోజన ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు వినయ్‌భాస్కర్‌ను కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. కొద్ది రోజుల్లోనే సంబంధిత అధికారులను క్షేత్ర స్థాయికి తీసుకొచ్చి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎండి సోని, బండి రాంచందర్, భద్రయ్య, ఆకుల రాజయ్య, అబ్దుల్ కలాం ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- 75వ జాతీయ విద్యార్థి దినోత్సవం

పరకాల : విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పోరాడుతున్న ఘనత ఏబీవీపీకే దక్కుతుందని నగర కార్యదర్శి వావిలాల వెంకటరమణ స్పష్టం చేశారు. ఆ సంఘం స్థానిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 75వ జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంగడి చౌరస్తాలో ఆ సంఘం జెండాను వెంకటరమణ ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం 75 ఏళ్లుగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార దిశగా పోరాటాలు నిర్మిస్తోందని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్య, సరైన వసతులు లభించేలా చూడాల్సిన బాధ్యతను సంఘం సమర్థవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మేడిపల్లి జిల్లా ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్ ఆకుతోట వరప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారుతి వరప్రసాద్ పాల్గొన్నారు.



జెండా ఎగరేస్తున్న వావిలాల వెంకటరమణ

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు



చిరు ధాన్యాలతో వంటలు చేసి చూపిస్తున్న కుసుమ కవిత

హన్మకొండ : చిరుధాన్యాలు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని రాజీవ్ పార్క్ వద్ద రికార్డ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఆవశ్యకతపై ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. రికార్డు సేవా సంస్థ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు చేసి మహిళలకు అవగాహన కల్పించి, కాలనీవాసుల సందేహాలను తీర్చారు. కార్యక్రమంలో ఈ.వి.శ్రీనివాస్, కిరణ్మయి, బి.భరత్ బాబు, టి.శ్రీనివాస్, శ్యామ్ ,రవీందర్, కవిత పాల్గొన్నారు.

వీసీకి జేఏసీ నాయకుల అభినందన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి న్యాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్ లభించినందున కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం క్యాంపస్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌ను కలిసి మొక్కను అందజేసి అభినందించారు. వీసీని కలిసిన వారిలో విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ తీగల ప్రేమ్‌సుందర్, అధికారప్రతినిధి రాకేష్ కృష్ణన్, బాధ్యులు ఆగపాటి రాజు, సంజీవ్, చెన్నూరి సాయి తదితరులు ఉన్నారు.

యాదగిరికి 'పశ్చిమ' టిక్కెట్ ఇవ్వాలి

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌ను బీసీ రజక సామాజిక వర్గానికి చెందిన ఉల్లెంగల యాదగిరికి ఇవ్వాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి (టీఆర్‌ఆర్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలో సమితి నాయకులు చాపర్తి రాజు, రాయాకుల మొగిలి, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33 ఏళ్లుగా యాదగిరి కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల్లో కాంగ్రెస్ బీసీ అభ్యర్థుల విజయానికి ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

వెల్ఫేర్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలి

ఖిలా వరంగల్ : 1990 బ్యాచ్ (టీఎస్‌ఎస్పీ) వరంగల్ పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించాలని అసోసియేషన్ అధ్యక్షుడు దశరథం, లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను వారు కలిసి శాలువాతో సత్కరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. 1990 బ్యాచ్‌కి చెందిన పోలీసుల వరంగల్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ద్వారా కోరగా తప్పనిసరిగా స్థలాన్ని ఇచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేకల డానియల్, ఎండీ.అమీర్‌పాషా, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, శ్రీనివాసరావు, భిక్షపతి, రాజేందర్, రమేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోలీస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రయాణికుడి బ్యాగు అప్పగింత

హన్మకొండ: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన బ్యాగును ప్రయాణికుడికి అందించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. ఆదివారం వరంగల్–1 డిపో ఎక్స్‌ప్రెస్ బస్సులో చొప్పరి విజయకుమార్ జగిత్యాల నుంచి మెట్టుపల్లి వరకు టికెట్ తీసుకుని ప్రయాణించాడు. తన బ్యాగును బస్సులోనే మర్చిపోయి మెట్‌పల్లిలో దిగిపోయాడు. బ్యాగును బస్సులోనే వదిలేశానని గుర్తు తెచ్చుకున్న ప్రయాణికుడు టికెట్‌పై ఉన్న వరంగల్–1 డిపోకు సమాచారం ఇవ్వగా డిపో సూపర్‌వైజర్ ఓ.రవీందర్ బస్సు కండక్టర్ కెవి.స్వామి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కండక్టర్ ప్రయాణికుడి బ్యాగును స్వాధీనం చేసుకుని ఆర్మూర్ బస్‌స్టేషన్ మేనేజర్‌కు అప్పగించగా ప్రయాణికునికి అందజేశారు.

